ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 25 ఫిబ్రవరి 2024



టిక్కెట్లు దక్కించుకుని స్వీట్స్ తినిపించుకుంటున్న ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి

• ఇది ఉమ్మడి టిక్కెట్

తణుకు అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా నాపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. టీడీపీకి టిక్కెట్ వచ్చినంత మాత్రాన జనసేన నాయకులు తక్కువేమీ కాదు. ఇది టీడీపీ, జనసేన ఉమ్మడి టిక్కెట్. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధిస్తా. జగన్ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించి, ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందాం.

• అందరిని కలుపుకుని వెళతా

ఉండి అభ్యర్థి, ఎమ్మెల్యే మంతెన రామరాజు

ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు మరోసారి టికెట్ కేటాయించడం ఆనందంగా ఉంది. చంద్రబాబు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మరోసారి అవకాశం కల్పిస్తానని ఇచ్చిన మాట ప్రకారమే నిలబెట్టుకున్నారు. అధిష్ఠానం నా పైన ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. వచ్చే ఎన్నికలకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల తోపాటు ప్రతీ నాయకుడిని కలుపుకుని వెళ్లి కూటమి అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తాం.



ఉమ్మడిగా ఏడుగురు



టీడీపీ శ్రేణుల సంబరాలు

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో టీడీపీ తొలి జాబితా విడుదల

సస్పెన్స్‌లో జనసేన జాబితా.. నేడో రేపో కీలక ప్రకటన

- సిట్టింగులు నిమ్మల, మంతెనకు అవకాశం.. రోషన్, చంటికి లక్కీ ఛాన్స్
- పితాని, ఆరిమిల్లి సహా ఎమ్మెల్యే పార్థసారథికి ప్రాధాన్యత
- తొలి జాబితాలో కనిపించని చింతమనేని, గన్ని
- అసంతృప్తితో మాజీ ఎమ్మెల్యే శివ.. త్వరలో కీలక నిర్ణయం



తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన నేతల అభివాదం

ఏలూరు, నరసాపురం లోక్‌సభ నియోజక వర్గాల పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో తెలుగుదేశం తన అభ్యర్థులను ప్రకటించింది. ప్రత్యేకించి కీలక నియోజకవర్గాలను పెండింగ్‌లో పెట్టారు. టిక్కెట్ ఖరారైన నియోజకవర్గాల్లో ఆయా అభ్యర్థులు, కేడర్ సంబరాలు చేసుకున్నారు. జనసేనకు 24 స్థానాలు కేటాయించినా జిల్లాలో ఏ ఏ స్థానాలనేవి ఆ పార్టీ తేల్చలేకపోయింది. దీంతో ఆ పార్టీలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రత్యేకించి లోక్‌సభ స్థానాల నుంచి పోటీకి దింపదలచిన వారి వివరాలు ఒకటి రెండ్రోజుల్లోనే ప్రకటించనున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నెలల తరబడి సాగిన టెన్షన్ శనివారంతో కాస్త తీరింది. తెలుగుదేశం-జనసేన ఎన్నికల పొత్తు అధికారికంగా ఖరారైన తర్వాత ఉమ్మడి జిల్లాలో ఈ రెండు పార్టీల నడుమ ఆశావహులంతా ఉత్కంఠకు గురయ్యారు. ఎవరికి ఏ స్థానం కేటాయిస్తారనే గందరగోళంలో మునిగితేలారు. ఆచంట నియోజకవర్గం నుంచే సీనియర్ నేత, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అభ్యర్థిత్వాన్ని ఖరారుచేశారు. పితాని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా వున్నారు. వైఎస్, చంద్రబాబు మంత్రి వర్గాల్లో పనిచేసిన అనుభవం వుంది. బీసీ వర్గాల్లో పెద్ద దిక్కుగా వున్న పితాని టీడీపీలో గట్టి పట్టు సాధించారు. ఈ స్థానంలో ఆయనకు పోటీగా మరెవరూ లేనంతగా పితాని రాజకీయాల్లో కొనసాగుతూ వచ్చారు. తాజాగా ఆచంట నుంచి ఆయన ఐదోసారి రంగంలోకి దిగుతున్నారు. మరో సీనియర్ నేత, అసెంబ్లీలో టీడీపీ ఉపనేత నిమ్మల రామానాయుడు మూడోసారి పాలకొల్లు నుంచి పోటీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గడచిన రెండుసార్లు ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కొని విజయం సాధించడమే కాకుండా గడచిన ఐదేళ్లలో అధికార వైసీపీ బనాయించిన అక్రమ కేసుల ఒత్తిళ్లతో సతమతమయ్యారు. అయినా ఖాతరు చేయకుండా ప్రజల పక్షాన నిలబడి, అసెంబ్లీలోనూ గళమెత్తడం ద్వారా అధికార పార్టీని గడగడలాడించారు. ఈసారి హ్యాట్రిక్ విజయం తనదేనన్న ధీమాతో నిమ్మల వున్నారు.

ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు స్థానం పదిలమైంది. సిట్టింగ్‌లకు తిరిగి టికెట్లు ఇస్తామని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు గతంలో చేసిన ప్రకటనను నిలుపుకున్నారు. తద్వారా ఎమ్మెల్యేకు రెండోసారి పోటీ చేసేందుకు అవకాశం చిక్కింది. ప్రజల్లో ప్రత్యక్షంగా కలియదిరగడం, వివాదరహితుడిగా పేరు పొందడం ఆయనకు కలిసొచ్చిన అంశాలు. ఉండి నుంచి ఈసారి తనకు టిక్కెట్ కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు పార్టీని అభ్యర్థించినా పని కాలేదు. ఇక్కడున్న పరిస్థితులు ఇంతకుముందే సిట్టింగులు అందరికీ టికెట్లు ఇచ్చి తీరతామని చంద్రబాబు ఇచ్చిన భరోసా తాజాగా తొలి జాబితాలో అక్షర రూపమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టిక్కెట్ దక్కకపోవడంతో శివ, ఆయన అనుకూల వర్గం తీవ్ర అసంతృప్తికి గురైంది. నేడో రేపో అయన కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వైసీపీ వర్గాలు శివను తమకు అనుకూలంగా ప్రసన్నం చేసుకోవడానికి సమాయత్తం అవుతున్నట్టు సమాచారం. తణుకు నియోజకవర్గంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఢీకొంటున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు తణుకు నుంచే మూడోసారి పోటీకి వీలుగా టీడీపీ టిక్కెట్ ప్రకటించింది. ఈ స్థానంలో జనసేన నుంచి అభ్యర్థి పోటీ చేస్తారని గతంలో పవన్ కల్యాణ్ ప్రకటించడం, అప్పటి నుంచి ఇప్పటి వరకు అటు టీడీపీ, ఇటు జనసేనలోనూ సాగిన టెన్షన్ కాస్తా ఆరిమిల్లి అభ్యర్థిత్వ ప్రకటనతో తొలగింది. టీడీపీ అధిష్ఠానం ప్రకటనతో టీడీపీ కేడర్ సంబరాలు చేసుకుంది.

ఏలూరు పార్లమెంట్ పరిధిలో..

ఏలూరు పార్లమెంట్ స్థానం పరిధిలో మూడు సీట్లు ఖరారయ్యాయి. ఏలూరు సీటు ఎవరికి కేటాయిస్తారోనని కొన్నాళ్లుగా సాగిన ఉత్కంఠను బడేటి చంటిని అభ్యర్థిగా ప్రకటించి టీడీపీ పూర్తిగా తొలగించింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం చంటికి ఇదే తొలి అనుభవం. తన సోదరుడు బడేటి బుజ్జి 2014 ఎన్నికల్లో ఏలూరు నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలవడమే కాకుండా ఆకస్మికంగా మృతి చెందారు. బడేటి కుటుంబపక్షాన చంటి తెర ముందుకు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుకుదనం పెంచారు. దీనికి తోడు దాదాపు అన్ని సర్వేల్లోను చంటికి అనుకూలతే లభించడంతో ఆయనకు టీడీపీ టిక్కెట్ ఖరారు చేశారు. రాజకీయాల్లో గడచిన దశాబ్దకాలంగా కొనసాగుతున్న సొంగా రోషన్ కుమార్‌ను ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన చింతలపూడి అభ్యర్థిగా ప్రకటించారు. రోషన్ సైతం తొలిసారిగా ఎన్నికల్లో పోటీకి దిగుతున్నారు. స్థానికంగా నేతలను కలుపుకుపోవడం, వివాదాలకు దూరంగా ఉండడం కరోనా సమయంలో ప్రజలకు చేయూతనివ్వడం, స్థానికుడు కావడంతో ఆయనకు టిక్కెట్ దక్కింది. పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడుగా కొనసాగి జిల్లాలో రెండవ అతిపెద్ద నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారు. దీర్ఘకాలంపాటు రాజకీయాల్లో వెలుగొందిన పెనమలూరు సిటింగ్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఈ మధ్యనే వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. బీసీ వర్గాలకు చెందిన ఆయన 2004లో కాంగ్రెస్ పక్షాన పామర్రు నుంచి తొలిసారి గెలుపొందారు. ఆ తర్వాత 2009లోనూ ఇదే నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 2014లో మచిలీపట్నం ఎంపీగా వైసీపీ పక్షాన పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పెనమలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. రాజకీయ సమీకరణల్లో భాగంగా మార్పులు చేర్పులు జరిగి వైసీపీని వీడి టీడీపీలో చేరగా తాజాగా నూజివీడు సీటును కేటాయిస్తూ తెలుగుదేశం విధాన ప్రకటన చేసింది.

ఉమ్మడి సభ నిర్వహణకు.. 12 మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో టీడీపీ నుంచి ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, ఎంవీ సత్యనారాయణరాజు, తోట సీతారామలక్ష్మి, వలవల బాబ్జి, జనసేన నుంచి కొటికలపూడి గోవిందరావు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చాగంటి మురళీకృష్ణ, రత్నం అయ్యప్ప ఉన్నారు.

జనసేనకు సీట్లెన్ని?

ఉమ్మడి పొత్తులో భాగంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ శనివారం ఉమ్మడిగా తమ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. జనసేనకు 24 సీట్లు కేటాయించినా, కేవలం ఐదు స్థానాలను, అభ్యర్థులను మాత్రమే పవన్ ప్రకటించారు. నరసాపురం, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఎన్ని సీట్లు జనసేనకు కేటాయించిందనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఆఖరికి భీమవరం నుంచి పవన్ కల్యాణ్ పోటీకి సిద్ధంగా ఉండగా ఏ కారణం చేతనో తొలి జాబితాలో ఆయన పేరు ప్రకటించలేదు. దీంతో జనసేన కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు తీవ్రంగా కలత చెందారు. ఈ నెల 28న గూడెంలో జనసేన-టీడీపీ ఉమ్మడి సభ జరగనుండడంతో ఆ లోపే ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను పవన్ ప్రకటిస్తారని భావిస్తున్నారు. జిల్లాలో నాలుగు, లేదా ఐదు స్థానాలు జనసేనకు కేటాయించినట్టు ప్రచారం సాగుతోంది. దీంతో జనసేనలో ఆశావహులంతా సమాచారం కోసం శనివారం క్షణం తీరిక లేకుండా గడిపారు. ముందుగా ప్రచారం సాగినట్టుగానే జనసేన జాబితా ఉండబోతుందా అనే ఉత్కంఠే ఇప్పుడు మళ్లీ ఆరంభమైంది. టీడీపీ టికెట్లు ఖరారు కాని నియోజకవర్గాలన్నిటిలోనూ జనసేన టెన్షన్ ఊపిరి సలపనీయనంతగా మారింది.

• ప్రజల రుణం తీర్చుకుంటా

పాలకొల్లు అభ్యర్థి, ఎమ్మెల్యే రామానాయుడు

పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు 2014, 2019 ఎన్నికల్లో నా మీద నామ్మకంతో నన్ను ఆదరించి గెలిపించారు. టీడీపీ అధికారంలో ఉండగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించా. ఈ ఐదేళ్లు ప్రజల వెంటే నడిచి సమస్యలపై పోరాటం చేస్తున్నా. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని ఈసారి నిలబెట్టుకుంటా. మూడోసారి టికెట్ ఇచ్చిన చంద్రబాబు, పవన్‌ల నమ్మకాన్ని కాపాడుకుంటా. మూడోసారి అత్యధిక మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తా.

సీనియర్ల పరిస్థితి ఏమిటి ?

తెలుగుదేశం తొలి జాబితాలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, దెందులూరు ఫైర్ బ్రాండ్ చింతమనేని ప్రభాకర్‌కు చోటు దక్కకపోవడం పార్టీ వర్గాల్లో విస్మయం కలిగించింది. ప్రత్యేకించి ఈ రెండు స్థానాల్లో ఆ పార్టీకి పూర్తిగా పట్టుంది. వివిధ సర్వేల్లోనూ వీరిద్దరికే అనుకూలత ఉన్నట్టు చెబుతున్నారు. తీరా తొలి జాబితాలో స్థానం దక్కకపోవడంతో ఆయా నియోజకవర్గాల కార్యకర్తలు, నేతలు తీవ్రంగా మదనపడుతున్నారు. టీడీపీ అధిష్ఠానం ఈ మేరకు ఆచి తూచి నిర్ణయం తీసుకుందని కొందరు జనసేన పొత్తు దరిమిలా నిర్ణయాలు పెండింగ్‌లో వుంచారని ఇంకొందరు ఊహాగానాలు ప్రచారం చేశారు. కైకలూరును బీజేపీ పొత్తు దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో పెట్టారని సమాచారం. ఈ స్థానం నుంచి మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు టిక్కెట్ ఆశిస్తున్నారు.

ప్రత్తిపాడు సభ దద్దరిల్లాలి

ఏపీకి జగన్ పాలన నుంచి విముక్తి కలిగించాలి : టీడీపీ-జనసేన నాయకుల సమన్వయ సమావేశంలో నేతలు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24 : టీడీపీ, జనసేన పార్టీలు కలిసి ఉమ్మడిగా నిర్వహించే మొట్ట మొదటి భారీ బహిరంగ సభను చూసి అధికార వైసీపీ అభ్యర్థులు పోటీ చేసేందుకు భయపడే విధంగా ఉండాలని టీడీపీ జోన్-2 ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీన ఉభయ పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొనే ఈ బహిరంగ సభ నిర్వహణపై శనివారం తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలలో ఎవరికి టికెట్లు వచ్చినా మిగిలిన వారు కలిసి పనిచేసే విధంగా సంసిద్ధంగా ఉండాలని, రెండో ఆలోచన పెట్టుకోకూడదన్నారు.

- జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ ఉమ్మడి సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. ఈ సభ ద్వారానే జనసేన, టీడీపీ కలిసి రాష్ట్రాభివృద్ధికి కలిసి పనిచేస్తాయనే సంకేతాలు ఇవ్వాలన్నారు.
- టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌ల ఉమ్మడి నాయకత్వంలో పనిచేస్తే ప్రజల అభీష్టం నెరవేరుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు.
- పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జగన్ పాలన నుంచి ఏపీకి విముక్తి కలిగించే విధంగా ప్రతీ టీడీపీ, జనసేన కార్యకర్త పనిచేయాలన్నారు. సభకు ఆరు లక్షలకు పైగా నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చే విధంగా సభ నిర్వహించాలన్నారు. దీనికోసం బస్సులు, కార్లు, సిద్ధం చేసుకోవాలన్నారు.
- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఉమ్మడి సభ నిర్వహణకు ఉవ్వెత్తున అభిమానులు వచ్చేలా పనిచేయాలన్నారు. ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనతో తాడేపల్లి ప్యాలెస్‌లో భూకంపం వచ్చిందన్నారు.
- తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం ఈ ఉమ్మడి సభపైనే చర్చించుకునే విధంగా సభ నిర్వహిస్తామన్నారు. అంతా సమన్వయంతో పనిచేస్తేనే అది సాధ్యం అవుతుందన్నారు.
- నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి సభకు నియోజకవర్గం నుంచే 70 వేల మందిని తరలించే విధంగా బాధ్యతలు తీసుకుందామని పిలుపునిచ్చారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, టీడీపీ, జనసేన నాయకులు పితాని సత్యనారాయణ, కేఎస్ జవహర్, బూరుగుపల్లి శేషారావు, గన్ని వీరాంజనేయులు, మాకా ఈశ్వరయ్య, కంచాల వెంకటలక్ష్మి, బీవీ రావు, యిర్రింకి సూర్యారావు, పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



చంటి విజయకేతనం

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వం

- ఏలూరు అభ్యర్థి బడేటి చంటి

వైసీపీ అరాచక పాలనతో విసుగెత్తిన రాష్ట్ర ప్రజలు టీడీపీ-జనసేన కూటమి వైపు చూస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించ డం ఖాయం. టీడీపీ-జనసేన కూటమి కలయిక పట్ల ప్రజలు సంతృప్తి గా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా నా గెలుపు ఖాయం. కార్యకర్తలే మా బలం. వారికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం.



పితానికి విజయతిలకం

34 స్థానాలూ మనవే

- ఆచంట అభ్యర్థి పితాని సత్యనారాయణ

నాకు టిక్కెట్ కేటాయించిన పార్టీ అధినేత చంద్రబాబుకు అభినందనలు. ఈ ఎన్నికల్లో జనసేన-టీడీపీ విజయదుందుభి మోగిస్తుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని 34 స్థానాల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేస్తుంది. ఈ కూటమిలోకి బీజేపీ చేరితే స్వాగతిస్తాం. ఇప్పటికే చంద్రబాబుతో ఆ పార్టీ పెద్దలు చర్చించారు. త్వరలోనే ఓ నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నాం.

సమన్వయంతో విజయం

- నూజివీడు అభ్యర్థి పార్థసారథి

పార్టీ అధిష్ఠానం నాపై వుంచిన నమ్మకాన్ని నిలబెడతా. నూజివీడులో టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయం. నేను ఇక్కడకు కొత్తగా వచ్చా. ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుంటూ కార్యకర్తలు, నాయకులను కలుసుకుంటున్నా.

వైసీపీకి ఎంపీ రఘురామ గుడ్‌బై

- కూటమి అభ్యర్థిగా నరసాపురం నుంచే పోటీ
- ఏ పార్టీ నుంచి అనేది త్వరలో క్లారిటీ
- జగన్ సర్కార్‌తో నాలుగేళ్లుగా పోరాటం
- స్వస్థలం వచ్చేందుకు అవరోధాలు.. కేసులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ లేఖను పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌కు పంపించారు. 2019 ఎన్నికల్లో నరసాపురం ఎంపీ అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత కాలంలో ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో గళ మెత్తడంపై పార్టీ అధిష్ఠానంతో విభేదాలు తలెత్తాయి. జగన్ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం ప్రశ్నించేవారు. దీనిపై పార్టీ అధిష్ఠానం ఆయనపై కక్ష గట్టి అరెస్టు చేయించి రాజద్రోహం వంటి కేసులు పెట్టి వేధించసాగింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతున్నారంటూ ఆయనపై అనర్హత వేటు వేయించేందుకు లోక్ సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇంత జరుగుతున్నా ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు సాహసించలేదు. మరోవైపు నాలుగేళ్లుగా నియోజకవర్గానికి రాలేని పరిస్థితి. భీమవరంలో ప్రధాని మోదీతో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామ రాజు భారీ విగ్రహం ప్రారంభోత్సవానికి రానివ్వకుండా అడ్డుకున్నారు. అయితే ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా కోర్టు ద్వారా ప్రత్యేక భద్రత తీసుకుని భీమవరం వచ్చారు.

ఎంపీ లాడ్స్‌పైనా అయిష్టత

ఎంపీపై అధికార పార్టీకి ఎంత కక్ష అంటే.. చివరకు ఎంపీ లాడ్స్ కూడా వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు వినియోగించుకోలేదు. తెలుగుదేశం, జనసేన నేతలే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించేందుకు ఎంపీని సంప్రదించి నిధులు రాబట్టుకున్నారు. ఈ పనులకు కూడా అధికార పార్టీ నేతలు అవరోధాలు సృష్టించారు. టెండర్లు పిలవకుండా కట్టడి చేశారు. ఇలా నరసాపురం పార్లమెంట్ పరిధిలో పలు నియోజకవర్గాల్లో ఎంపీ నిధులకు మోక్షం లభించలేదు. మరోవైపు పాలకొల్లు, ఉండి, తాడేపల్లిగూడెం, ఆచంట, తణుకు నియోజకవర్గాల్లో తెలుగుదేశం, జనసేన నాయకులు ఎంపీ నిధులను వినియోగించుకుని అభివృద్ధి పనులు చేపట్టారు. తెలుగుదేశం, జనసేన సర్పంచ్‌లు ఉన్న చోట పనులు కొనసాగాయి. జగన్ సర్కార్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిత్యం ఎండగడుతూ ప్రజలకు రఘురామ చేరువయ్యారు. ప్రతిపక్షాలకు దగ్గరయ్యారు. ఈ క్రమంలోనే తాజాగా వైసీపీకి రాజీనామా చేశారు.

తెలుగుదేశం-జనసేన పొత్తులో భాగంగా తొలి విడత సీట్లు ప్రకటించిన రోజే ఈ నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులు ఫైనల్ అయిన తర్వాత బీజేపీ నుంచి నరసాపురం ఎంపీగా పోటీ చేసే అవకాశం ఉంది. బీజేపీ లేకుంటే టీడీపీ నుంచి పోటీ చేయవచ్చు. పొత్తులు పూర్తిగా ఫైనల్ అయిన తర్వాత దీనిపై క్లారిటీ వస్తుంది.

నేడే గ్రూప్- 2 పరీక్ష

- అభ్యర్థులు ఒక్క నిమిషం

ఆలస్యమైనా అనుమతి లేదు : జేసీ

భీమవరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం జరిగే ఏపీపీఎస్సీ గ్రూప్- 2 పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 10-30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 9-30 గంటల నుంచి 10 గంటల లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, గ్రేస్ పీరియడ్‌తో కలిపి 10-15 గంటల వరకు అనుమతిస్తారని ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 14,546 మంది హాజరు కానున్నారన్నారు. 17 మంది రూట్ ఆఫీసర్లు, 37 మంది లైజన్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావా లన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

అభ్యర్థులకు అందుబాటులో బస్సులు

భీమవరం టౌన్ : ఆదివారం జరగబోయే గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా బస్ కాంప్లెక్స్ నుంచి పరీక్షా కేంద్రాలకు బస్సులను నడుపుతున్నట్టు భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి తెలిపారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

భీమవరంటౌన్,ఫిబ్రవరి 24 : పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వచ్చేవరకు పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని, బిడ్డల భవితవ్యానికి మార్గదర్శకమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమా మహేశ్వరరావు అన్నారు. వచ్చేనెల 3,4,5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో విజయవంతం చేయాలంటూ శనివారం ర్యాలీ, అవగాహనా సదస్సు, కరపత్రాల పంపిణీ కార్యక్రమం శ్రీవిజ్ఞానవేదిక, డీఎంహెచ్‌వో శాఖ, మునిసిపాల్టీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పల్స్ పోలియోను అందరూ విజయవంతం చేయాలన్నారు. డీవైఈవో శ్రీరామ్, చెరుకువాడ రంగసాయి ప్రభుత్వ వైద్యుడు రఫీ ఉద్దీన్, డిప్యూటీ డెమో అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నాచువారి సెంటర్‌లో పల్స్‌పోలియో ర్యాలీలో డీఎంహెచ్‌వో , తదితరులు

అమృతమూర్తికి అశ్రునివాళి



జననం : 22-12-1937
మరణం : 15-02-2024

శ్రీ పెండ్యాల కృష్ణమూర్తి గారు

ఉన్నతమైన విలువలు కలిగిన వ్యక్తిత్వం, నిలువెత్తు ఆత్మ విశ్వాసం..
నిజాయితీకి నిదర్శనం, అందరిని ఆప్యాయంగా పలుకరించే మంచి మనిషి,
మా చిన్నాన్న శ్రీ పెండ్యాల కృష్ణమూర్తి గారి
ఆకస్మిక మరణం మాకు తీరనిలోటు..
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

నిడదవోలు కుసుమాంబ - రత్తయ్య
కంటిపూడి గంగా భవాని - సూర్యప్రకాశరావు
గోరంట్ల లక్ష్మి - సాంబశివరావు
పెండ్యాల హరినాథ్ బాబు - శ్రీలక్ష్మి
మనుమలు, మనుమరాండ్రు

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు : ఆర్ఐవో



భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్ఐవో పరీక్షల విభాగ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు సూచించారు. భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో శనివారం జిల్లాలోని కళాశాల అధ్యాపకులు, పరీక్షల పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలకు ప్రథమ సంవత్సరం 17,806 మంది, రెండో సంవత్సరం 18,143 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 8:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారన్నారు. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించమన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయా కేంద్రాల పరిధిని మొబైల్ ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించామన్నారు. విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రాల్లోని పర్యవేక్షకులకు కూడా చరవాణి అనుమతి లేదన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లా పరీక్షల విభాగ సభ్యులు శ్రీనివాసరావు, నరసింహమూర్తి, రాజ్‌కృష్ణ, ఇంటర్మీడియట్ విద్యావిభాగ జిల్లా అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్ఎం, ఇద్దరు ఉపాధ్యాయులకు చార్జ్ మెమో



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈవో అబ్రహం

పెదవేగి, ఫిబ్రవరి 24 : పెదవేగి మండలం విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులకు చార్జ్‌మెమో ఇస్తూ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎస్. అబ్రహం ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో శనివారం విజయరాయి జడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎఫ్ఏ-4 ఆంగ్ల పరీక్ష జరుగుతోంది. కాగా 4,5 తరగతుల విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.వెంకటరమణతో పాటు ఆంగ్ల ఉపాధ్యాయులు డి.హరిప్రసాద్, కె.నీలిమలకు చార్జ్ మెమోలు జారీచేశారు. పరీక్షల నిర్వహణ సమయంలో అలసత్వం వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెంటపాడు ఎంఈవో-1 శ్రీనివాస్‌పై విచారణ

పెంటపాడు, ఫిబ్రవరి 24 : పెంటపాడు మండల ఎంఈవో-1 శ్రీనివాస్‌పై శనివారం తాడేపల్లిగూడెం డీవైఈవో ఎస్.రవీంద్ర భారతి విచారణ చేపట్టారు. ఎంఈవో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో కూడా పనిచేస్తున్న ఉపాధ్యాయులను డిప్యుటేషన్లపై పంపిచేస్తున్నారని, గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులతో ఎటువంటి సంప్రదింపులు చేయకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని మండల జడ్పీటీసీ ఉప్పులూరి వరలక్ష్మి జిల్లా విద్యాశాఖాధికారికి చేసిన ఫిర్యాదు మేరకు డీవైఈవో విచారణ చేపట్టారు.ఎంపీపీ దాసరి హైమావతి, జట్లపాలెం గ్రామానికి చెందిన మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కట్టుబోయిన కృష్ణప్రసాద్, గ్రామ ఎంపీటీసీ వెంకటలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ రావి దుర్గారావులు కూడా పలు సమస్యలను డీవైఈవో దృష్టికి తీసుకువచ్చారు. డీవైఈవో మాట్లాడుతూ అందరి అభిప్రాయాలు సేకరించామని నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పరిశోధనా కృషికి పబ్లికేషన్లే కొలమానం

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 24 : విద్యార్థులు, ఆచార్యుల పరిశోధనా కృషికి పబ్లికేషన్లే కొలమానమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (కాంచిపురం, చెన్నై) ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.చిట్టిబాబు అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డిల పర్యవేక్షణలో సంస్థలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నాణ్యమైన, సమర్థవంతమైన పరిశోధనా పత్రాలను పేరెన్నిక కల్గిన అంతర్జాతీయ జర్నల్స్‌లో ఏ విధంగా ప్రచురించాలనే అంశంపై ఏపీ నిట్ ప్రాంగణంలో శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకురావాలన్నారు. నాణ్యమైన పరిశోధన ప్రచురిస్తే ఐఐటీ, ఎన్ఐటీ వంటి విద్యాసంస్థలతో పాటూ పేరెన్నిక కల్గిన కంపెనీలలో ఉద్యోగాలను దక్కించుకోవచ్చునన్నారు.



ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి

బెంగళూరు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బబ్రతా దాస్

తాడేపల్లిగూడెం రూరల్,ఫిబ్రవరి 24: విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక విద్యను అభ్యసించాలని అప్పుడే మారుతున్న పోటీ ప్రపంచంలో ముందుకెళ్తారని బెంగళూరు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బబ్రతాదాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ట్రిపుల్‌ఈ 2024 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మరో విశిష్ట అతిథి నేతాజి సుబాష్ చంద్రబోస్ వర్శిటీ (న్యూఢిల్లీ) డైరెక్టర్ డాక్టర్ ప్రేరణా గౌర్ మాట్లాడుతూ వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రొఫెసర్‌లు, రీసెర్చ్ విద్యార్థులను ఒకేవేదిక మీదకు తెచ్చి ఆవిష్కరణలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. వీటి ద్వారా మన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కళాశాల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ పేపర్స్ ప్రదర్శన వల్ల తమ కళాశాల విద్యార్థులకే కాకుండా మన ప్రాంతంలోని ఇతర పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ ఎండీ ఇస్మాయిల్, కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.ప్రాజెక్టుల ప్రదర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల, యూఎస్, యూకేల నుంచి 80 ప్రాజెక్టులను 180 మంది విద్యార్థులు ప్రదర్శించారు.

తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

ఆకివీడు, ఫిబ్రవరి 24: కుప్పనపూడిలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొన్నట్టు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.వారినుంచి రూ.8,300 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ట్రాన్స్‌కోకు బకాయిల షాక్

పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు

ఉమ్మడి జిల్లాలో రూ.1207.64 కోట్లు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 24: విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బకాయిల భారంతో విద్యుత్ సంస్థలు ఆర్థికంగా తల్లడిల్లుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నా బకాయిల వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు ఒక్కనెల బిల్లు చెల్లించకపోతే సర్వీసులను తొలగించేస్తారు. స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థల నుంచి బకాయిల వసూళ్లు విద్యుత్ శాఖకు పెనుభారంగా పరిణమించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా రావాల్సిన విద్యుత్ బకాయిలు రూ. 1207.64 కోట్లు వరకు ఉన్నాయని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి. విద్యుత్ బకాయిలు మొత్తంలో స్థానిక సంస్థలదే అగ్రభాగంగా నిలిచిందని చెబుతున్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి ఆర్థిక సంఘ నిధుల నుంచి విద్యుత్ బకాయిలు చెల్లించాలని చెబుతున్నా సక్రమంగా జరగకపోవడంతో విద్యుత్ బకాయిలు పేరుకు పోతు న్నాయని చెబుతున్నారు.ప్రభుత్వ సంస్థల నుంచి కూడా రావాల్సిన బకాయిలు సక్రమంగా వసూలు కావడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.



బకాయిలు ఇలా

జిల్లాలో ప్రభుత్వ సంస్థలకు సంబంధించి ఇప్పటివరకు విద్యుత్ బకా యిలు రూ. 600.72 కోట్లు వరకు ఉన్నాయి. స్థానిక సంస్థల విషయాని కొస్తే రూ. 606.90 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. ప్రధా నంగా పంచాయతీలలో వీధి దీపాలకు సంబంధించి రూ. 72.51 కోట్లు, వాటర్ వర్క్స్‌కు సంబంధించి రూ. 474.18 కోట్లు , మున్సిపాల్టీల్లో విద్యుత్ దీపాలకు సంబంధించి రూ. రూ.2.31 కోట్లు, మున్సిపాల్టీలలో వాటర్ వర్క్స్‌కు సంబంధించి రూ.9.66 కోట్లు, మున్సిపల్ కార్పోరేషన్‌లో విద్యుత్ దీపాలకు సంబంధించి రూ.6.19 కోట్లు, మున్సిపల్ కార్పోరేషన్‌లో వాటర్ వర్క్స్‌కు సంబంధించి రూ.40.81 కోట్లు, ఎన్‌టీఆర్ సుజల పథకానికి సంబంధించి రూ.1.22 కోట్లు బకాయిలు ఉన్నాయని నివేదికల్లో పేర్కొన్నాయి. స్థానిక సంస్థలకు సంబంధించి విద్యుత్ డివిజన్ల వారీగా పరిశీలిస్తే భీమవరం డివిజన్‌లో రూ. 23.06 కోట్లు, ఏలూరు రూ. 241.81 కోట్లు, జంగారెడ్డిగూడెం రూ.114.33 కోట్లు, నరసాపురం రూ. 21.90 కోట్లు, నిడదవోలు రూ.146.42 కోట్లు, తాడేపల్లిగూడెం డివిజన్‌లో రూ. 49.40 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. ఇక స్థానిక సంస్థలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మొత్తంలో ఎల్‌టీ విద్యుత్ బకాయిలు రూ. 596.94 కోట్లు ఉండగా, హెచ్‌టీ బకాయిలు రూ. 9.96 కోట్ల వరకు ఉన్నాయి.





నిప్పుల గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు..గాలాయిగూడెం అమ్మవారు

నిప్పుల గుండం తొక్కిన భక్తులు

దెందులూరు , ఫిబ్రవరి 24 : దెందులూరు మండలం గాలాయిగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో నిప్పుల గుండం ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరా, సారె, బోనాలు సమర్పించారు. అగ్నిగుండం తొక్కడం వల్ల పిల్లలు లేని వారికి పిల్లలు పుడతారని, తమ భర్త నిండునూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలనే నమ్మకంతో భక్తులు నిప్పులను తొక్కుతారు. శనివారం సుమారు 30 వేల మంది వరకూ నిప్పుల గుండ ప్రవేశం చేశారు.



వైభవంగా లక్ష్మీనరసింహస్వామికి చక్రస్నానం



చక్రస్నానం నిర్వహించిన అర్చకులు

అంతర్వేది, ఫిబ్రవరి 24: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి పురస్కరించుకుని శని వారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయం వద్ద నుంచి అలంకార మండపంలో పూజలందుకున్న స్వామివారు గరుడ పుష్పక వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగారు. పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళవాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామికి, చక్రపెరుమాళ్ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరూరు ఉద్దండ పండితుల శిరస్సుపై శ్రీ చక్రపెరుమాళ్‌ను ఉంచి సముద్ర స్నానం చేశారు. స్వామితో పాటు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు, అగ్నికుల క్షత్రియులు పున్నమి స్నానాలు ఆచరించారు. అనంతరం పూజలు అందుకున్న స్వామి, చక్రపెరుమాళ్‌ను వసంత మండపానికి అర్చకులు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామికి నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదం పంచారు. రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం సాయంత్రం గ్రామ చెరువులో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. రాత్రి దర్పణసేవ, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

'టెట్' రాష్ట్ర పరిశీలకుడిగా నరసింహారావు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : ఏపీ ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్)లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షలు ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాల, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, అగిరిపల్లిలోని ఎన్నారై కళాశాలల్లో జరుగుతాయి. రోజుకి రెండు సెషన్లలో నిర్వహించే ఈ పరీక్షలకు రాష్ట్రస్థాయి పరిశీలకుడిగా ఏపీ రెసి డెన్షియల్ స్కూల్స్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు నియమితుల య్యారు. నాలుగు పరీక్షా కేంద్రాలకు నలుగురు ప్రధానోపాధ్యాయులను నోడల్ ఆఫీసర్లుగా నియమించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)లుగా ఈనెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు జిల్లాలో జరుగుతాయి. జిల్లాలో ఎంతమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నదీ వివరాలను విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదివారం పంపించనున్నారు.





లక్ష్మీనారసింహునికి హారతులిస్తున్న అర్చకులు.. పొంగళ్లు వండుతున్న మహిళలు

కమనీయం..చందనోత్సవం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 24: ఉగ్రనారసింహుడు చందనలేపనంతో సేదతీరారు. సుందరగిరిపై ఐఎస్. జగన్నాథపురం ఆలయంలో కొలువైన లక్ష్మీనారసింహుని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం జరిగిన శ్రీచందనోత్సవం భక్తజనులకు నేత్రపర్వమైంది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు, మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకాలను నిర్వహించారు.చందనాన్ని విశేషంగా పూశారు. పలువురు మహిళా భక్తులు కొండపై పాలపొంగళ్లను వండి స్వామివారికి నివేదన చేశారు. మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణ జరిపించారు. శనివారం కావడంతో వెంకన్న క్షేత్రం భక్తుల రాకతో కళకళలాడింది. దాదాపు 20వేల మంది పైబడి యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి.



ఎస్ఐ శిక్షణకు వెళ్ళే అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

శిక్షణలో చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : ఐజీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : ఎస్ఐ రిక్రూట్‌మెంట్‌లో వివిధ పోస్టులకు అర్హత సాధించిన ఏలూరు రేంజ్ పరిధిలోని 105 సివిల్ ఎస్ఐ పోస్టులకు 103 ఎంపికయ్యారు. వీరిని శిక్షణకు శనివారం పంపిస్తున్న సందర్భంలో ఏలూరు రేంజ్ డీఐజీ కార్యాలయం వద్ద ఐజీ మాట్లాడారు. ఏలూరు రేంజ్ పరిధిలోని జోన్ 2లో 105 మంది సివిల్ పోస్టులకు 103 ఎంపిక అయ్యారని వీరిలో సివిల్ ఎస్ఐ పోస్టులకు 93 మందిని అనంతపురం ట్రైనింగ్ కాలేజీకి శిక్షణ నిమిత్తం పంపుతున్నామన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్స్ సివిల్ పురుషులు, మహిళలు ఎంపికైన వారిలో 12 మంది పోలీస్ కానిస్టేబుళ్ళు ఉన్నారన్నారు. ప్రజాసేవ చేసే అవకాశం ప్రత్యక్షంగా పోలీసులకే ఉంటుందని మీ అందరికీ అలాంటి అరుదైన గౌరవం దక్కిందని, శిక్షణ సమయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

బ్రిటీష్ కాలం నాటి జైలు కూల్చివేత

కైకలూరులో నూతన సబ్ జైలు నిర్మాణానికి శ్రీకారం



కైకలూరు, ఫిబ్రవరి 24: బ్రిటిష్ కట్టడాలకు కాలం చెల్లింది. 1913లో బ్రిటిష్ అధికారులు నిర్మించిన జైళ్ళల్లో కైకలూరు పట్టణంలోని సబ్‌జైలు ఒకటి. కైకలూరు కేంద్రంగా పూర్వం బ్రిటిష్ పాలన సాగుతూ వస్తుండగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి ఆనుకుని 24 సెల్స్ ఏర్పాటు చేస్తూ జైలు నిర్మించారు.ఈ జైలు శిథిలావస్థకు చేరడంతో దీనిని కూల్చివేసి ఆధునిక వసతులతో కూడిన జైలు నిర్మాణానికి గత ఏడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. రూ. రెండు కోట్లతో దీనిని నిర్మించనున్నారు. రెండు రోజుల క్రితం 16 మంది ఖైదీలను మచిలీపట్నంలోని ఉమ్మడి కృష్ణా జిల్లా జైలుకు తర లించారు. సుమారు ఏడేళ్ల క్రితం వరకు 24 సెల్స్‌లో 4 సెల్స్‌ను మహిళా ఖైదీలకు వినియో గించుకునేలా జైలుశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అనంతరం మహిళా ఖైదీలను కైకలూరులో కాకుండా ఏలూరు కారాగారాలకు తరలించేవారు. నూతనంగా నిర్మించే జైల్లో ప్రత్యేకంగా మహిళా విభాగం ఏర్పాటు చేస్తున్నారు. ఈ జైల్లో దివంగత నాయకుడు వంగవీటి రంగా మూడు నెలల పాటు ఒక కేసులో ఇక్కడే శిక్ష అనుభవించినట్లుగా ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు.ఇప్పటికే జైలు ఖాళీ అవడంతో మరో నాలుగు రోజుల్లో పాత భవనాన్ని కూల్చే పనులు ప్రారంభిస్తున్నారు.

కాంగ్రెస్‌కు జెట్టి గురునాథరావు రాజీనామా



జంగారెడ్డిగూడెం/కొయ్యలగూడెం,ఫిబ్రవరి 24 : కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జెట్టి గురునాథరావు కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మెయిల్ ద్వారా పంపారు. కాంగ్రెసు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ క్యాడర్‌ను కాపాడుకుంటూ పార్టీలో ఉన్న ఆయన ఎన్నికలకు ముందు అకస్మాత్తుగా పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశం అయ్యింది. అధికార పార్టీ వైసీపీలో చేరనున్నట్టు తెలిసింది. గతేడాది కూడా గురునాథరావు టీడీపీలోకి మారుతున్నారనే ప్రచారం సాగింది. అయితే అప్పటి నుంచి మౌనంగా ఉన్న గురున్నాదరావు ఇప్పుడు తాజాగా కాంగ్రెసుకు రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాల్లో కాంగ్రెసు పార్టీలో ఉన్న గురున్నాదరావు అనుచరులు కూడా రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. కొయ్యలగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జుంగా జవహర్‌లాల్ నెహ్రూ (బాబ్జీ) రాజీనామా చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావుకు లేఖ పంపుతున్నట్లు తెలిపారు.



చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

క్రమశిక్షణతో జూనియర్లు ముందుకు సాగాలి

నరసాపురం, ఫిబ్రవరి 24: సీనియర్ న్యాయవాదులు అనుసరించిన క్రమశిక్షణ, సంప్రదాయాలను యువ న్యాయవాదులు పాటిస్తూ వృత్తిలో ముందుకు సాగాలని హైకోర్టు న్యాయమూర్తులు అన్నారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం కోర్టు ప్రాంగణంలో స్వర్గీయ ఆందే బాపన్న చిత్రపటాన్ని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి ఆకుల వెంకటశేషసాయి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరసాపురం బార్ అసోసియేషన్‌కు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఉద్దండులైన హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదుల్ని అందించిన ఘనత ఈ కోర్టుకే దక్కిందన్నారు. సీనియర్ న్యాయవాదులు ఓపిక ఉన్నంత వరకు కోర్టుకు వచ్చి సేవలందించాలన్నారు. మరో న్యాయమూర్తి నైనాల జయసూర్య మాట్లాడుతూ న్యాయవాదులు క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసినప్పుడే వృత్తిలో రాణించగలమన్నారు. మరో జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రజలకు న్యాయసలహాలను అందించడంలో న్యాయవాదులు ముందుండాల న్నారు. జస్టిస్ నూనేపల్లె హరినాద్ మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని వృత్తిలో రాణించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు సభకు అధ్యక్షత వహించారు. విశ్రాంతి హైకోర్టు న్యాయమూర్తి సోమయాజులు, జిల్లా న్యాయమూర్తి పురుషోత్తమ్‌కుమార్, ఏపీ బార్ అసోసియేషన్ సభ్యులు కృష్ణారెడ్డి, సీనియర్ న్యాయవాదులు అరికె బాబ్జీ, అడబాల స్వామినాయుడు, వెంకటాచార్యులు, జ్ఞానప్రకాష్, సూరిబాబు, రఘురాం, కృష్ణారావు, పురేళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం



న్యాయాధికారి రామ్‌గోపాల్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భవ్యశ్రీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : నేడు ప్రతి ఒక్కరు యాంత్రిక జీవితంతో, ఒత్తిళ్ళకు గురై అనారోగ్యం పాలవుతున్నారని దీని నుంచి తప్పించుకోవడానికి ప్రతిఒక్కరు రోజుకు గంటైనా వ్యాయామం చేయాలని మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రామ్‌గోపాల్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కోర్టులో ఉన్న న్యాయ సేవాసదన్‌లో కోర్టు సిబ్బందికి, న్యాయ వాదులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధుల వైద్య శిబిరాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఈఎన్‌టీ డాక్టర్ భవ్యశ్రీ, డాక్టర్ చందనలు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి రత్నప్రసాద్ మాట్లాడుతూ కోర్టు సిబ్బంది, న్యాయవాదులు నిత్యం పని ఒత్తిడితో ఎన్నో ఇబ్బందులు పడుతుం టారని, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడానికి వీలుగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ భవ్యశ్రీ మాట్లాడుతూ జిల్లాలో షుగరు, బీపీలకు గురవుతున్నారని వీటి వల్ల చెవి నరాలు దెబ్బతిని వినికిడి సమస్య వచ్చే ప్రమాదం ఉందని, ముక్కు వాసన కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించడం ఎంతో ముఖ్యమన్నారు. డాక్టర్ చందన మాట్లాడుతూ డస్ట్ ఎలర్జీ ఉన్నవారు మాస్క్ ధరించడం ఎంతో మంచిదని సూచించారు. ఏలూరు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ తిగిరిపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

మార్చి 9న అంజుమన్ సంస్థ ఎన్నికలు



విలేకరులతో మాట్లాడుతున్న అంజుమన్ సంస్థ నాయకులు

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 24: పాలకవర్గం పదవీకాలం ముగియడంతో అంజుమన్ సంస్థకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు అధ్యక్షుడు ఎమ్డీ సులేమాన్ తెలిపారు. ఎన్నికల కమిటీ కన్వీనర్ షేక్ ఇబ్రహీం, ఎన్నికల అధికారి చెదలవాడ వెంకటరమణ, ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. మార్చి 1 నుంచి 2 వరకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. 3న స్క్రూట్నీ, 4న ఉపసంహరణ, 5న ఎన్నికల గుర్తు కేటాయిస్తామన్నారు. 6 నుంచి 8 వరకు ప్రచారం నిర్వహించుకోవచ్చన్నారు. మార్చి 9న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 5 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మూడుజోన్‌ల పరిధిలో 35 మంది కార్యవర్గ సభ్యులు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. సమావేశంలో ఉప ఎన్నికల అధికారి ఉప్పులూరి హేమశంకర్, ఎన్నికల కమిటీ సభ్యులు ఎండీ ఇలియాస్, మున్వర్ షరీఫ్, సయ్యద్ బాజీ, ఎండీ జావేర్, సంస్థ సెక్రటరీ అమీద్‌జానీ, కోశాధికారి ఎం.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వు ఫారెస్టులోకి పులి తిరుగుముఖం



రెడ్డినాగంపాలెం సమీపంలో పులి పాదముద్రలు

పోలవరం, ఫిబ్రవరి 24 : రెండు నెలలుగా ప్రజానీకాన్ని భయాందోళనలకు గురి చేసి, అటవీశాఖ అధికారులను ముప్పు తిప్పలు పెట్టిన పులి శనివారం రిజర్వు ఫారెస్టులోకి వెళ్ళినట్లు అటవీక్షేత్రాధికారి దావీదురాజు తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం కరకపాడు అడవిలో రెండు మేకలను బలితీసుకున్న పులి అక్కడి నుంచి బుట్టాయిగూడెం మండలం లక్ష్మీపురం కొవ్వాడ గ్రామాల పరిధిలో సంచరించి పోలవరం మండలం రెడ్డినాగంపాలెం చేరుకుందని అక్కడి నుంచి రిజర్వు ఫారెస్టులోకి వెళ్ళి పోయిం దని, పులి పాదముద్రలు పరిశీలించామని అటవీశాఖ అధికారులు తెలిపారు. రామనరసాపురం, సరిపల్లికుంట, జిల్లేళ్లగూడెం పంచాయతీల ప్రజలు పాడి పశువుల రైతులు అడవుల్లోకి వెళ్ళరాదని, పశువులను మేపడానికి అడవుల్లోకి వెళ్ళరాదని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైదాన ప్రాంతాల్లో పాడిపశువుల సంచార ప్రాంతాలు అలవాటు పడిన పులి మళ్ళీ రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పులి దాడిలో చనిపోయిన పాడి పశువుల రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

PLOT FOR SALE

AP Capital అమరావతికి కేవలం 6 కి.మీ. లలో కుంచికచర్ల కి అతి దగ్గరలో Proposed ఔటర్ రింగ్ రోడ్ దగ్గరలో 100 చ.గజాలు ప్లాట్ కేవలం Rs. 2,70,000/- మాత్రమే. Ph: 97001 08588

AJB - 165199

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రమాణించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకుల బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పన్నించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

క్రైం కార్నర్

మెడికల్ రిప్రజెంటేటివ్ ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : కుటుంబ కలహాలతో భార్య ఆత్మహత్య చేసుకోగా తన బిడ్డను తనకు ఇవ్వాలని అత్తింటి వారిని కోరాడు. ఎన్ని రోజులకు బిడ్డను ఇవ్వక పోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఒక మెడికల్ రిప్రజెంటేటివ్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏలూరు రాణీనగర్‌కు చెందిన మంతిన రమేష్ (35) మెడికల్ రిప్రజెం టేటివ్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య వెంకటలక్ష్మి డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. వీరిద్దరి మధ్య రెండు నెలల క్రితం గొడవ రావడంతో వెంకటలక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వెంకటలక్ష్మి మరణించిన తరువాత తన కుమారుడిని తనకు ఇవ్వాలంటూ రమేష్ అత్తింటి వారిని కోరాడు. అప్పటి నుంచి ఇవ్వక పోవడంతో ఒంటరి జీవితం గడుపుతూ తీవ్ర మనస్థాపానికి గురై శనివారం వేకువజామున ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ నరసింహారావు, హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైరు పేలి వ్యాన్ పల్టీ..ఐదుగురికి తీవ్ర గాయాలు



ముసునూరు, ఫిబ్రవరి 24: మండలంలోని చిల్లబోయినపల్లి ప్రధాన రహదారిలో శనివారం సాయంత్రం టాటా ఏస్ వాహనం టైరు పేలి పల్టీ కొట్టిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు గాయపడ్డారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ వీరం పాలెంకు చెందిన 15 మంది టాటా ఏస్ వాహనంలో ముసునూరు మండలం చిల్లబోయినపల్లి వచ్చి మరో ఐదుగురుని ఎక్కించుకుని గోపవరం గ్రామంలో ఉదయం జరిగిన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠకు వచ్చారు. సాయంత్రం తిరిగి వెళుతున్న క్రమంలో చిల్లబోయినపల్లి ప్రధాన రహదారిలో టాటా ఏస్ వాహనం వెనుక టైర్ ఒక్కసారిగా పేలి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా వీరిలో ఇద్దరు మహిళలకు తలకు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన 15 మంది గాయాలపాలయ్యారు. వైస్ ఎంపీపీ పాముల గంగధరరావు, స్థానికులు క్షతగాత్రులను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న చింతమనేని ప్రభాకర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శనివారం రాత్రి పరామర్శించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్..మహిళ మృతి



రమాదేవి (ఫైల్)..పరిశీలిస్తున్న పోలీసులు

పాలకోడేరు, ఫిబ్రవరి 24 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గొల్లలకోడేరు గ్రామంలో శని వారం సాయంత్రం చోటు చేసుకుంది. గొల్లలకోడేరు గ్రామం తోట శివారులో చేకూరి రమాదేవి (45) భర్త శ్రీహరిరాజుతో ఓ రేకుల షెడ్‌లో నివసిస్తున్నారు. వీరికి ఒక కుమార్తు, కుమార్తె ఉన్నారు. పాప బెంగుళూరులో చదువుతుండగా, బాబు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. రమాదేవికి కొంత కాలంగా నరాల బలహీన వ్యాధితో బాధపడుతూ ఉంది. శ్రీహరిరాజు బయటకి పనిపై వెళ్ళగా, చేకూరి రమాదేవి మాత్రమే ఇంట్లో ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో ఆమె కాలి బూడిదైందని స్థానికులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 24 : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లుగా ఎఎస్ఐ విజయ కుమార్ తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన మహిళ శనివారం తెల్లవారుజామున టాయిలెట్‌కి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ళ వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ తెలియలేదు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

130 సెల్‌ఫోన్లు స్వాధీనం..బాధితులకు అందజేత



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 24 : ఏలూరు జిల్లాలో ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లలో 130 ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి వెల్లడించారు. ఏలూరు పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోయిన ఫిర్యాదులను స్వీకరించామని వాటిలో జనవరి నెలలో 130 సెల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సిబ్బంది రికవరీ చేశారన్నారు. వీటి విలువ 19 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ మొత్తం 11 దఫాలుగా సెల్‌ఫోన్లు రికవరీ చేయడం జరిగిందని 1,455 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని వీటి విలువ 2 కోట్ల 90 లక్షల 69 వేల 684 రూపాయలని వెల్లడించారు. సెల్‌ఫోన్లు కల్గిన వారు అత్యంత జాగ్రత్తగా తమ వస్తువు భద్రపర్చుకోవాలని, సెల్‌ఫోన్లు నేరస్తులు అటెక్షన్ డ్రైవర్షన్ చేస్తారని రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, బ్యాంకులు, ఏటీఎంలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో దృష్టి మళ్ళించి ఫోన్లను అపహరిస్తారన్నారు. ఫోన్లకు పాస్‌వర్డ్ లాక్ పెట్టుకోవడం ఎంతో మంచిద న్నారు. సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ డ్రమ్ము పేలి ఒకరికి తీవ్రగాయాలు



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24: ఖాళీ డ్రమ్ము కెమికల్ గ్యాస్‌తో నిండి పోవడంతో ఆ డ్రమ్ము ఓపెన్ చేస్తుండగా పేలి ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది.ఎల్. అగ్రహారంలో ప్లాస్టిక్ రిసైక్లింగ్ సెంటర్ వద్ద పాత డ్రమ్ము కట్ చేస్తున్న తరుణంలో పేలిపోవడంతో బీహార్‌కు చెందిన సచిన్ పొట్టలోంచి ప్రేగులు బయటపడ్డాయి. దీంతో వెంటనే అతడిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

వైభవ వెంకన్నకు లక్ష్మీనర్సింహ అలంకరణ



నరసాపురం రూరల్, ఫిబ్రవరి 24: వేములదీవి గ్రామంలో వైభవ వెంకటేశ్వరస్వామిని శనివారం భక్తులు లక్ష్మీనర్సింహ రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి రూపాన్ని చూసేందుకు తీర ప్రాంతానికి చెందిన భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. ఇటు మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలో కనకదుర్గా విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అఖండ సమారాధన నిర్వహించారు.

వాసవీధామ్‌లో చండీహోమం



పెనుగొండ, ఫిబ్రవరి 24: మాఘ పౌర్ణమి సందర్భంగా పెనుగొండ శ్రీ వాసవి శాంతి ధామ్ క్షేత్రంలో వైభవంగా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా గూటెన్ బర్గ్ జయంతి



పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 24: ప్రింటింగ్ పితామహుడు జోహాన్నెస్ గూటెన్ బర్గ్ జయంతిని శనివారం పాలకొల్లు మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక భవాని డిజిటల్ ప్రెస్ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమంలో కంప్యూటర్ విజ్ఞానం పుస్తక వ్యవస్థాపకులు ముత్యాల రామారావు, కొత్తపల్లి శ్రీనివాస్, కాగిత సూర్యనారాయణ, రేకపల్లి విజయ్, యాదంరెడ్డి చిన్ని, తోట శ్రీను, పప్పుల దుర్గేష్, కాటంరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ



నరసాపురం టౌన్, ఫిబ్రవరి 24: పట్టణంలోని 44వ బూత్ కన్వీనర్ షేక్ యూనిస్ బేగం ఆహ్వానం మేరకు ఎన్‌ఆర్ మహ్మద్ నూర్ ఆర్థిక సహకారంతో పేదలకు నిత్యావసరాలు అందించారు. వీటిని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు చేతల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, షేక్ హుసేన్, కె నరేష్, ఎన్ రాంబాబు పాల్గొన్నారు.

నేడు సీసలిలో ఉచిత వైద్య శిబిరం

కాళ్ళ, ఫిబ్రవరి 24 : సీసలి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు శనివారం తెలిపారు. ఇండియన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామంలో సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తారు.

చర్చి నిర్మాణానికి సిమెంట్ బస్తాల వితరణ



యలమంచిలి, ఫిబ్రవరి 25: మండలంలోని ఊటాడ గ్రామంలోని న్యూలైఫ్ కృషెడ్ చర్చి నిర్మాణానికి ధర్మారావు ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు 25 సిమెంట్ బస్తాలను సమకూర్చారు. ఊటాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నిమ్మల సమకూర్చిన బస్తాలను ఫౌండేషన్ సభ్యులు చర్చి నిర్వాహకులకు అందజేశారు. పాస్టర్ తానేటి ఆనందరావు, సర్పంచ్ బుడితి జయరాజు, నెక్కంటి సత్యనారాయణ, పీతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి డి.సత్యవతి

తణుకు, ఫిబ్రవరి 24: మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, నాల్గో అదనపు జిల్లా న్యాయాధికారి డి.సత్యవతి కోరారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కక్షిదారులు కేసులను రాజీ చేసుకోవాలని చెప్పారు. ఏలూరులోని శాశ్వత లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా కూడా కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పీవీ నాగరాజు, స్పెషల్ మెజిస్ట్రేట్ చిరంజీవి పాల్గొన్నారు.

అన్నదానం



వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న కోళ్ల

భీమవరం టౌన్, ఫిబ్రవరి 24: రాయలం గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆరవ వార్షికోత్సవం పురస్కరించుకుని మాజీ సర్పంచ్ కోళ్ల అబ్బులు ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నడింపల్లి శ్రీనివాసరాజు, వినాయక్ అంతర్వాతి, గుబ్బల బాలకృష్ణ, నారాయణమూర్తి పాల్గొన్నారు.

26న తణుకులో ఎస్పీ స్పందన

భీమవరం క్రైం, ఫిబ్రవరి 24 : జిల్లా ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆలోచనతో ఈనెల 26వ తేదీ సోమవారం నాడు తణుకులోని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తెలిపారు. జిల్లా ప్రజలందరూ గమనించాలని ఎస్పీ పేర్కొన్నారు.

బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు కావాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24: తాడేపల్లిగూడెంలో బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం అవసరమని ఏపీ ఆక్వాకల్చర్ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం నాయుడు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో శనివారం నిర్వహించిన ధ్యాన మందిరం 40వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. రెండో అంతస్తులో ఏర్పాటుచేసిన వసతి సదుపాయాన్ని ఆయన ప్రారంభించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

విష్ణులో టీఈడీఎక్స్ సీజన్-1 ఈవెంట్

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 24 : విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం నాడు ఇనిఫినిట్ త్రేడ్స్ అంశంపై టీఈడీఎక్స్ సీజన్-1 ఈవెంట్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.మంగం వేణు మాట్లాడుతూ టీఈడీఎక్స్ అనేది టీఈడీ లాంటి అనుభవాన్ని పంచుకోవడానికి వ్యక్తులను ఒక చోట చేర్చే స్థానిక, స్వీయ వ్యవస్థీకృత ఈవెంట్‌ల ప్రోగ్రామని తెలిపారు. ఈ ఈవెంట్‌లో టీఈడీ టాక్స్ వీడియో, లైవ్ స్పీకర్‌లు ఒక చిన్న సమూహంలో లోతైన చర్చను, కనెక్షన్‌ని రేకెత్తిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మీ, వివిధ విభాగాధిపతులు, టీఈడీఎక్స్ గ్లోబల్ కోఆర్డినేటర్ ఆకాష్ మల్లారెడ్డి, టీఈడీఎక్స్ ఆర్గనైజర్ సీఎస్ఈ విద్యార్థిని దశిక వైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.









పితాని విజయం సాధించాలని వాడపల్లికి టీడీపీ నాయకుల పాదయాత్ర.. మార్టేరులో పితానికి స్వీటు తినిపిస్తున్న టీడీపీ నేతలు.. అత్తిలి మండలంలో ఆరిమిల్లి రాధాకృష్ణను భుజానికెత్తుకున్న కార్యకర్తలు.. కొలమూరులో అమ్మవారికి ఉండి ఎమ్మెల్యే రామరాజు పూజలు

టీడీపీలో టిక్కెట్ల జోష్

పెనుమంట్ర, ఫిబ్రవరి 24 : ఎన్నికల కురుక్షేత్రలో టీడీపీ-జనసేన కూటమి గెలుపొందడం ఖాయమని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం మార్టేరులో పితాని ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. పితానికి టిక్కెట్ ఖరారు కావడంతో టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ప... గ్రామ టీడీపీ నాయకుడు తేతలి రాజారెడ్డి పితాని సత్యనారాయణకు స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన కూటమిలో బీజేపీ చేరితే స్వాగతిస్తామని అన్నారు. ఇప్పటికే చంద్రబాబుతో చర్చలు జరిగినట్లు సమాచారం అందుతుందని చెప్పారు. అప్రజాస్వామికంగా అరాచక పాలన సాగించిన జగన్మోహన్ రెడ్డిని సాగనంపేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, తెలుగు రైతు అధ్యక్షుడు వెలగల బులిరామరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు అనుమలశెట్టి రాంబాబు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ముంతాజ్ బేగం అలీ, టీడీపీ మండల అధ్యక్షుడు కార్యదర్శులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, గూడూరి మురళీమోహన్ జనసేన మండల అధ్యక్షుడు కార్యదర్శులు కోయా వెంకట కార్తీక్, వినుకొండ తేజ రామానాయుడు పాల్గొన్నారు. మార్టేరు పెద్ద పేటలోని 13 మంది దళిత యువకులు మాజీ మంత్రి పితాని సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకున్నారు. దళితుల మేనమామగా చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారని పితాని అన్నారు.

పెనుగొండ: ఆచంట నియోజకవర్గం అభ్యర్థిగా పితాని సత్యనారాయణకు మొదటి జాబితాలో స్థానం కల్పించిన నారా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలుపుతూ పెనుగొండలో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కటికిరెడ్డి నానాజీ, వేంద్రరాము, మండా ప్రసాద్, నక్కా వేద వ్యాస శాస్త్రి, రొక్కాల సురేష్, మద్దిశెట్టి వెంకటేష్, పులిగోరు రవి కుమార్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా వడలి గ్రామంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరుగు టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి సభకు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సిద్దాంతంలో యువత ఆర్గనైజింగ్ సెక్రటరి బోడపాటి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి పాద యాత్ర చేపట్టారు. ఆచంట నుంచి సిద్దాంతం చేరుకోవడంతో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

పితాని విజయం సాధించాలని పాదయాత్ర

ఆచంట, ఫిబ్రవరి 24: సార్వత్రిక ఎన్నికల్లో పితాని సత్యనారాయణ ఆచంట నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించాలని శనివారం తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి బోడపాటి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో కొడమంచిలి వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి కోనసీమజిల్లాలోని వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వరకు పాదయాత్రగా వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కొడమంచిలి వెంకన్న ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి దారి మధ్యలో ఉన్న ఆలయాలను దర్శించుకుంటూ వాడపల్లి వెళ్ళారు. కార్యక్రమంలో పితాని తనయుడు వెంకట్, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, బాలం వెంకట రమణ, చిలుకూరి శ్రీను, కారెం సంజయ్, దబ్బా ప్రకాష్ పాల్గొన్నారు.

గణపవరం: అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కావాలంటే టీడీపీ, జనసేన పార్టీలను అధికారంలోకి తీసుకురావల్సిన అవసరం ఉందని గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు అన్నారు. శనివారం గణపవరం పట్టణంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించి మినీ మేనిఫెస్టోను ప్రతీ ఒక్కరికి వివరించారు. పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, పట్టణ టీడీపీ సెక్రటరీ కే.సింహాచలం, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బషీరుద్దీన్, వేగేశ్న సుబ్రహ్మణ్యం, పల్లి సతీష్, కూసంపూడి వర్మ, జొన్నాడ శ్రీను పాల్గొన్నారు.

ఉండి: ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంతెన రామరాజు రెండోమారు అధిష్టానం ప్రకటించడంతో ఉండి నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు సందడి చేశారు. రామరాజును పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

● శ్రీమండోదర అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా వుందంగా ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. శనివారం రాత్రి కోలమూరులోని శ్రీమండోదర అమ్మవారి జాతర నేపథ్యంలో ఎమ్మెల్యే రామరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు అమ్మవారిని పూజించారు. ఎమ్మెల్యే రామరాజుకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జు పేరిచర్ల కృష్ణంరాజు(బాలరాజు), పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కూనపరాజు సత్యనారాయణరాజు, పచ్చమట్ల రామరాజు, కూనపరాజు సూర్యనారాయణరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

'అన్ని వర్గాల ఉసురు తీసిన వైసీపీ'

అత్తిలి, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో వైసీపీ అన్ని వర్గాల ఉసురు తీసిందని తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సకల జనుల చైతన్యయాత్ర రేపటి కోసం పాదయాత్రలో ఐదో రోజు కొమ్మరలో ప్రారంభించారు. అడుగడుగునా మహిళలు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈడూరు ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలపగా అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శ్మశానాల వద్ద సిమెంటు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఇదేనా మీ ప్రగతి అంటూ మంత్రి కారుమూరినుద్దేశించి అన్నారు. వైసీపీ పాలన అంతా దోపిడీ మయం అని, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపు నిచ్చారు. దంతుపల్లిలో రాత్రి బస చేశారు. టీడీపీ అత్తిలి మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, కార్యదర్శి సత్యనారాయణ, కొరుకొల్లు హరి, ముదునూరి బాలకృష్ణంరాజు, మాజీ జడ్పీటీసీలు కృష్ణకుమారి, చుక్కా సాయిబాబా, చిట్టిబాబు, పోతునీడి శ్రీను, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

● తణుకు నియోజకవర్గం టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఆరిమిల్లి రాధాకృష్ణను ప్రకటించడం హర్షణీయమని అత్తిలి మండల టీడీపీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ అన్నారు. సర్వే నివేదికల ఆధారంగా ఆరిమిల్లి బలమైన అభ్యర్థి అని భావించి ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించడాన్ని స్వాగతిస్తూ భారీ మెజార్టీతో ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు ఎమ్మెల్యేగా గెలుపొందుతారని అన్నారు.

సోమేశ్వరస్వామికి అన్నాభిషేకం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 24 : గునుపూడిలోని సోమేశ్వరస్వామికి శనివారంనాడు అన్నాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దంపతులు నిర్వహించారు. స్మార్థ పండితుడు కొత్తపల్లి సూర్యప్రకాష్(లాలు)ఆధ్వర్యంలో ముందుగా పూజలు నిర్వహించారు. అన్నాభిషేకం అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఎమ్మెల్యే దంపతులు హోమాలు నిర్వహించారు.

మావుళ్ళమ్మ ఆలయంలో చండీ హోమం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 24: మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారంనాడు చండీహోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. 88 దంపతులు పూజలు చేయించుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మహాలక్ష్మి నగేష్, చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు (నాగన్న బాబు), ధర్మకర్తలు ముత్యాల రామారావు, మావూరి సుందరరావు, తాళ్ళపూడి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు 8 గ్రాముల బంగారం అందజేత



భీమవరం టౌన్, ఫిబ్రవరి 24 : మావుళ్ళమ్మ అమ్మవారికి దేవస్థానం మాజీ చైర్మన్ అడ్డాల రంగారావు కుమారుడు అడ్డాల నాని 8 గ్రాముల బంగారాన్ని శనివారంనాడు అందజేశారు. ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శిచుకున్నారు. అనంతరం బంగారాన్ని అందజేశారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని ప్రసాదాన్ని అందించారు.

జూపూడి దిష్టిబొమ్మ దహనం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 24 : అంబేడ్కర్ ఫొటో కన్నా డబ్బులు ముఖ్యం అన్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. జూపూడి వ్యాఖ్యలకు నిరసనగా శనివారం భీమవరంలో అంబేడ్కర్ సెంటర్‌లో జూపూడి ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ప్రజా ప్రతినిధులకు యూటీఎఫ్ వినతి పత్రాలు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 24: ఓపీఎస్ సాధన కోసం చేసే పోరాటంలో భాగంగా శనివారం భీమవరం ఉండి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు అందించినట్టు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఎంపీ కనుమూరి రాఘురామకృష్ణంరాజు, వైసీపీ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, రామరాజు, టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మికు వినతి పత్రాలు అందించారు.

పాఠశాల భవనం నిర్మించాలని వినతి

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 24: ఆర్తమూరు గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలని కోరుతూ భీమవరం ఆర్డీవో కె.శ్రీనివాసరాజును కేవీపీఎస్ నాయకులు శనివారం కలిసి వినతి పత్రం అందించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. క్రాంతిబాబు, నాయకులు చిన్నం చిన్న, నాగేశ్వరరావు, మాదాసి గోపి పాల్గొనారు..

యువకుడిని ఢీకొన్న కారు



ఆకివీడు, ఫిబ్రవరి 24: కళాశాల నుంచి వస్తున్న చెల్లెలిని తీసుకెళ్ళడానికి రోడ్డు పక్కన మోటారు సైకిల్‌పై ఆగి ఉన్న అన్నను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పెదపేటకు చెందిన రాఘవ చెల్లెలు భీమవరం ప్రైవేటు కళాశాలలో చదువుతున్నది. చెల్లెలు శనివారం కళాశాల నుంచి వస్తుంది, ఇంటికి తీసుకెళ్ళడానికి డాక్టర్ సందులో మోటారు సైకిల్‌పై ఆగి ఉన్న అతనిని జాతీయ రహదారి పైనుంచి సందులోకి వేగంగా ఒక కారు దూసుకొచ్చి అతనిపైకి ఎక్కించడంతో కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రిలో రాఘవ చికిత్స పొందుతున్నాడు. దీనితో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది.

26, 27 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గణపవరం, ఫిబ్రవరి 24: గణపవరం మండలం వరదరాజపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 26, 27 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు గణపవరం పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నా మన్నారు.

రాజీపడదగిన కేసులు గుర్తించాలి

భీమవరం క్రైం, ఫిబ్రవరి 24 : రాజీ పడదగిన కేసులను గుర్తించి, బాధితులు, ముద్దాయిలకు సమన్యాయం జరిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని, ప్రతీ కోర్టులోనూ ముందస్తు లోక్ అదాలత్ బెంచ్‌లను నిర్వహిస్తున్నట్లు 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు పోలీస్ అధికారులను ఆదేశించారు. మార్చి నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి పాలకోడేరు, వీరవాసరం, కాళ్ళ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని కేసులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి జి.సురేష్‌బాబు మాట్లాడుతూ రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం అందించడానికి కృషి చేయాలన్నారు. ప్రత్యక్షంగా హాజరు కాలేనివారు వర్చువల్‌గా హాజరు కావచ్చునన్నారు.

ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం



కాళ్ళ, ఫిబ్రవరి 24: బొండాడ గ్రామంలోని శ్రీపార్వతి సమేత భోగేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయాల ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. శ్రీపార్వతి సమేత భోగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా కేవీఆర్ సూర్యనారాయణ, శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ చైర్మన్‌గా మందపాటి రాము, సభ్యులచే దేవదాయ ధర్మాదాయశాఖ భీమవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, టీడీపీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయవాది రాధాకిరణ్మయి

పాలకోడేరు, ఫిబ్రవరి 24 : స్కూల్, కాలేజీలకు వెళ్ళే పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, చిన్న పిల్లలకు మొబైల్ వాడకాన్ని తగ్గించే విధంగా అంగన్‌వాడీ సిబ్బంది తమ సెంటర్‌కు వస్తున్న తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని న్యాయవాదులు డి రాధాకిరణ్మయి, బీవీ సూర్యస్వాతి అన్నారు. భీమవరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని విస్సాకోడేరు మాతా శిశు సంక్షేమ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారిణి టీకేవీ లక్ష్మీకాంతం అధ్యక్షతన నిర్వహించారు.

ప్రధాని పథకాలు అందరికీ అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24: ప్రధాని మోదీ పేదల కోసం అందించే పథకాలు అర్హులందరికీ అందేలా బీజేపీ శ్రేణులు చొరవ తీసుకోవాలని ఆ పార్టీ తాడేపల్లిగూడెం కన్వీనర్ ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సమావేశంలో ఆయన పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, ఆయుష్మాన్ భారత్, ప్రధాని విశ్వకర్మ యోజన తదితర పథకాలపై వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోట రాంబాబు, కో కన్వీనర్‌లు రామగాని సత్యనారాయణ, చిట్యాల రాంబాబు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 24: జిల్లాలో అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆర్డీవో కె. చెన్నయ్య పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో నిర్వహించారు. డీఎస్పీ సత్యనారాయణమూర్తి జిల్లాలో కేసులపై సమీక్షించారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు చికటమిల్లి మంగరాజు, తెన్నేటి జగ్జీవన్, సింగం త్రిమూర్తులు, ఏఎస్‌డబ్ల్యు బి. రామాంజనేయరాజు, డివిజినల్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఇరగవరం, ఫిబ్రవరి 24 : తణుకు మున్సిపల్ పరిధిలో ఇటీవల పూర్తి చేసిన సీసీ రోడ్లు, ఎస్సీ యాదవ సంఘ కమ్యూనిటీ హాల్స్, డ్రెయినేజీల అభివృద్ధి పనులను శనివారం మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా రూ. 3 కోట్లు పనులను ప్రారంభించామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ సత్తా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి షుగర్ వ్యాధి స్పెషలిస్టు

పెంటపాడు, ఫిబ్రవరి 24: అలంపురం ట్రస్టు ఆసుపత్రిలో ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్ అపోలో ఆస్పత్రి నుంచి విచ్చేసిన షుగర్ వ్యాధి స్పెషలిస్టు డాక్టర్ రాజశేఖర్ ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఆదివారం షుగరు, పాదాలలో తిమ్మిర్లు, మంటలు, స్పర్శ తగ్గటం, రక్తప్రసరణ తగ్గడం, మానని పుండ్లు, పాదాల వంకర, ఇన్‌ఫెక్షన్, గాంగ్రిన్ (కుళ్ళిపోవుట) తదితర వ్యాధులకు అవసరమైన పరీక్షలు చేస్తారన్నారు.

కాళ్ళకూరు వెంకన్నకు ఊంజల్ సేవ



కాళ్ళ, ఫిబ్రవరి 24 : కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన ఊంజల్ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాన్ని హైదరాబాద్‌కు పెన్మెత్స రియాన్ష్‌వర్మచే వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది.

ఘనంగా దానమ్మ ఊరేగింపు



పెంటపాడు, ఫిబ్రవరి 24: పెంటపాడులో శనివారం దానమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలు, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పుల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ



కోదండ రాముడుని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు

మొగల్తూరు, ఫిబ్రవరి 24: గరువు పల్లవపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో స్వామివారి విగ్రహప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సిద్ధాంతి పెద్దింటి అనిల్ కుమార్ ఆచార్యులు శిష్య బృందం ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయ, కోదండ రాముడు విగ్రహ, శిఖర ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

పార్వతీ అమ్మవారికి పాలభిషేకం

పెనుమంట్ర, ఫిబ్రవరి 24: మాఘమాస పౌర్ణమి తిథిని పురస్కరించుకుని అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. జుత్తిగలోని ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయంలో పార్వతి దేవి అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. దుర్గాదేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. నవగ్రహ ఆలయంలో శనీశ్వరస్వామికి తైలాభిషేకాలు, ఆంజనేయ స్వామికి విశేష అర్చన నిర్వహించారు. సోమేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

మొగల్తూరు, ఫిబ్రవరి 24: మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కలవారితోటలో నూతన రామాలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. పురాతన ఆలయం కావడంతో గ్రామస్థులు నూతన ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన కుక్కల రామకృష్ణ లక్ష్మీ దంపతులచే నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన ఇన్‌చార్జ్ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి సుబ్బారాయుడు, టీడీపీ నాయకుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

దత్తస్వామికి అభిషేకాలు



ఆకివీడు, ఫిబ్రవరి 24: ఆకివీడు దత్త క్షేత్రంలో మాఘ పూర్ణిమ సందర్భంగా శనివారం అనఘాదేవి సమేత విశ్వాబరావధూత దత్తస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు దత్తుడిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ట్రస్టీ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

శ్రీవారికి ప్రత్యేక అలంకరణ



భీమవరం టౌన్, ఫిబ్రవరి 25 : జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా 80కేజీల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. పట్టణానికి చెందిన గాదిరాజు సత్యనారాయణ రాజు దంపతుల సౌజన్యంతో అలంకారం చేశారు.

గీతామందిరం ప్రారంభం

ఉండి, ఫిబ్రవరి 24: రాజుపేటలోని శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో గీతామందిరాన్ని స్వామిజీ నాగానంద సరస్వతీ ప్రారంభించారు. గీతామందిరం శిథిలావస్థకు చేరడంతో దాతలు తమ్మినాన రామన్న దంపతులు, సువ్వారి పోలయ్య దంపతుల ఆధ్వర్యంలో పునఃనిర్మాణం చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ ఆలయంలో ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు.

ల్యాబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఉండి, ఫిబ్రవరి 24: యండగండిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పబ్లిక్ హెల్త్ యూనిట్ ల్యాబ్‌ను రూ.50లక్షలతో నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగులమండ చిన్నకృష్ణమూర్తి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు పాల్గొన్నారు.